క్లుప్తంగా

పురపాలక అభివృద్ధికి కృషి



ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటరామిరెడ్డి

ఆళ్లగడ్డ: ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రజల సహకారంతో ఆళ్లగడ్డ పురపాలక సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నూతన కమిషనర్ వెంకటరామిరెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి నియమితులయ్యారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రమేష్ బాబు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆళ్లగడ్డలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఉందని.. పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

వ్యాపారాలు మార్కెట్‌లో చేసుకోవాలి



వ్యాపారులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ పరిధిలోని చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను గాంధీ చౌక్‌లోనున్న కూరగాయల పెద్ద మార్కెట్‌లో నిర్వహించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సూచించారు. శనివారం స్థానిక కూరగాయల మార్కెట్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఫుట్ పాత్‌లను ఆక్రమించి రోడ్ల పైన కూరగాయలు, పండ్లు అమ్ముకోవడాన్ని నిషేధిస్తున్నామన్నారు. అలాగే వాహనదారులు పార్కింగ్ స్థలాల్లో తమ వాహనాలు నిలుపుకోవాలని చెప్పారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థి పి.జశ్విత 10వ తరగతిలో 576 మార్కులు సాధించి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థినికి జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. గతేడాది కూడా తులసి అనే విద్యార్థిని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టెక్కె వీధిలో వెలసిన నాగలింగేశ్వర ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శనివారం అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, సింధూరాభిషేకం జరిపించి 108 వడలతో మాల రూపొందించి అలంకరించారు.

దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

నంద్యాల(అర్బన్): ఫ్యామిలీ మెంబర్, మరణ ధ్రువీకరణ పత్రాలు, పాసు పుస్తకాలపై సమగ్ర విచారణ చేసి నిర్ణీత సమయంలోగా దరఖాస్తులు సంబంధిత కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ ప్రియదర్శిని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆర్ఐలు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందజేయాలని చెప్పారు. ఆర్ఐ యుగంధర్‌రెడ్డి, డీటీ రామసంజీవరావు పాల్గొన్నారు.

26నుంచి వారాంతపు క్రీడా ఉత్సవాలు

నంద్యాల(న్యూటౌన్): హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు చేపట్టే వారాంతపు క్రీడా ఉత్సవాలను జయప్రదం చేయాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలు జారీ చేసిందని నంద్యాల జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, హాకీ, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్, క్రికెట్, చెస్, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, సంప్రదాయ క్రీడలు సాకురేస్, రోజ్ జంపింగ్, ఖోఖో, లగోరీ వంటి పోటీలను జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల విజేతలకు ఆగస్టు 29న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 2023–24లో జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను సత్కరించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులు ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 12గంటల్లోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు సెల్ 8712622576 నంబరులో సంప్రదించాలని కోరారు.

సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి



ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ కోసం సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. వైద్యశాలలో మౌలిక వసతులు మెరుగుపర్చాలి. ఆస్పత్రి ప్రాంగణంలో పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేసి పోలీసులను ఉంచాలి. వైద్యులపై దాడి చేస్తే కఠిన శిక్షలు పడేలా చట్టాలను రూపొందించాలి.

–డాక్టర్ రాజ్యలక్ష్మి, సీహెచ్‌సీ, ఆళ్లగడ్డ

భద్రత ఉంటే ధైర్యం



ఆసుపత్రులో పటిష్ట భద్రత కల్పిస్తేనే నిర్భయంగా విధులు నిర్వహించగలం. కోల్‌కత్తా ఘటన మహిళా డాక్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుత వాతావరణంలో భయం గుప్పిట్లోనే వైద్య సేవలు అందిస్తున్నాం. ఆసుపత్రిలో సీసీ కెమెరాలతో నిఘా పెంచాలి. మహిళా వైద్యులను ఒత్తిడికి గురి చేయకూడదు. రోగుల వెంట వచ్చే సహాయకులు నియంత్రణ పాటించాలి. వారిలో ఒక్కరికే ఎంట్రీపాసు జారీ చేయాలి. పరిమిత వేళల్లోనే పరామర్శించేందుకు వచ్చే వారిని అనుమతించాలి. వైద్యులు ప్రశాంతంగా పని చేసేందుకు భరోసా కల్పించాలి.–డాక్టర్ ఉదయసంధ్యా, పీహెచ్‌సీ, నంద్యాల(మం)

కోనసీమ కాదు..





నంద్యాల మండలంలోని పాండురంగాపురం గ్రామం ప్రకృతి అందాలతో కోనసీమను తలపిస్తోంది. పచ్చని చెట్లు, కుంటలతో గ్రామంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఏపుగా పెరిగిన చెట్లను చూస్తూ గ్రామానికి వచ్చిపోయే వారు మైమరచిపోతున్నారు. పచ్చని పొలాలు, చెట్లను చూస్తూ ఇక్కడి వాతావరణం తమ గ్రామాల్లో ఉంటే ఎంత బాగుంటుందని చర్చించుకుంటున్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారుల్లో జాతీయస్థాయి అవార్డులు పొందిన పాండురంగాపురం.. పచ్చదనాన్ని సంరక్షించడంలో కూడా అవార్డులు సాధిస్తుందేమో చూడాలి. – నంద్యాల(అర్బన్)

ఏఎస్పీకి సన్మానం



అడిషనల్ ఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: బదిలీపై వెళ్తున్న అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌ను శనివారం ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ..తాను ఎస్ఐ స్థాయి నుంచి వచ్చానని చెప్పారు. ప్రస్తుత ఎస్పీ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. నంద్యాల జిల్లాలో ఎన్నికల నిర్వాహణ, శాంతిభద్రతల విషయంలో తన వంతు కృషి చేశానని తెలిపారు. డీఎస్పీలు రామాంజినాయక్, యుగంధర్‌బాబు, రవికుమార్ పాల్గొన్నారు.

28న ఇంటర్వ్యూలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 28వ తేదీన ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెటిరో ల్యాబ్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం చేయుటకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి పీపీ ప్రతాపరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతాయని, ఐటీఐ, ఫిట్టర్, బీఎస్సీ, కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చర్చించి తక్షణం ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి కొత్త నీరు వస్తుండడంతో గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసిన తరువాతనే నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఉప మండలాధ్యక్షులు ప్రసాద్, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూళ్లకు దరఖాస్తులు

ఉయ్యాలవాడ: పదో తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో సార్వత్రిక విద్యాపీఠం–విద్యావికాసం సాధికారత అనే అంశంపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్లు చొరవ తీసుకోవాలన్నారు. వివిధ కారణాలతో పదో తరగతి, ఇంటర్ చదవలేని వారు ఓపెన్ స్కూళ్లలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ఎంఈఓ ఉయ్యాలవాడ ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతి గృహాలను, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. వారి వెంట హాస్టళ్ల సంక్షేమ అధికారులు శంకర్, సురేష్, మాధవి ఉన్నారు.

ఎంఈఓపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నందికొట్కూరు ఎంఈఓ ఫయజున్నీసా బేగం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓ సుధాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 7న వెబెక్స్ మీటింగ్‌లో పాల్గొనలేదని, మరుసటి రోజు విధులకు హాజరు కాలేదనే కారణంతో పాఠశాల విద్య కడప ప్రాంతీయ సంచాలకులు సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. పీఎంసీ ఎన్నికలు ఉన్నందున రాత్రి ఎస్పీ టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొని మరుసటి రోజు జరిగే ఎన్నికలకు సమాధానం ఇస్తూ వెబెక్స్ మీటింగ్‌లో కూడా పాల్గొన్నారన్నారు. ఎలాంటి విచారణ చేపట్టకుండా చర్యలకు పూనుకోవడం తగదని, ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తే ఉద్యమ బాట పడతామని స్పష్టం చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసాద్, నరసింహరావు, దేవేంద్రారెడ్డి, బాలీశ్వరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శిశువు మృతిపై విచారణ

పాములపాడు: వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే డెలివరీ అయిన వెంటనే శిశువు మృతి చెందాడని ఆరోపిస్తూ శనివారం ఉదయం ఆసుపత్రి వద్ద చేసిన ఆందోళన పై ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కాంతారావు నాయక్, ఎఫ్‌డీఓ నోడల్ ఆఫీసర్ జగదీష్, ఏఓ డాక్టర్ భరత్ స్థానిక పీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్‌షా, స్టాఫ్‌నర్సు సౌజన్యలను విచారించారు. అలాగే బాధితురాలు సునీత, కుటుంబ సభ్యులను విచారించారు. వారు చెప్పిన అన్ని విషయాలను నోట్ చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: శివపురం గ్రామ శివారులోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి దేవి క్షేత్రంలో భక్తులు విశేష పూజలు నిర్వహించుకున్నారు. శ్రావణ మాస శ్రీ వెంకయ్య స్వామి ఆరాధన సందర్భంగా శనివారం దక్షిణాయం శుక్ల పక్షం రోజున ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శమిచ్చారు. భక్తులు అమ్మవారి విశేష పూజలు చేసుకున్నారు. అనంతరం 30 మంది చిన్నారులకు ఆలయ పురోహితులు తల్లిదండ్రులతో కలసి బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసాలు చేయించారు.

సూడోమోనాస్‌తో అగ్గితెగులు నివారణ



నాటు విధానాన్ని వివరిస్తున్న డీఏఓ మురళీకృష్ణ

నంద్యాల(అర్బన్): సూడోమోనాస్ ద్రావణంలో నారు ముంచి నాటు వేయడం ద్వారా వరిలో అగ్గితెగులును నివారించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరినారు కత్తరించి సూడోమోనాస్ ద్రావణంలో ముంచి నాటే విధానాన్ని రైతులకు ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నారు మడిలోని కొనల మీద గుడ్లు పెడుతుందని, నారు కొనలు తుంచి నాటడం వల్ల ఆ గుడ్లు నాశనమవుతాయన్నారు. కాండం తొలుచు పురుగు ఉధృతిని అదుపులో పెడితేనే దిగుబడులు సాధించగలుగుతారన్నారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ నారు వేసే టప్పుడు 25–30రోజుల నారును ఒకటి లేదా రెండు కర్రలతో మాత్రమే నాటాలన్నారు. ఒక చదరపు మీటరుకు 33 కుదుర్లు ఉండేలా నాటుకోవడం ద్వారా మొక్కలకు గాలి బాగా అంది గంట కడుతుందన్నారు. గట్ల మీద కంది నాటుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ఏఓ ప్రసాదరావు, వీఏఏలు అనిల్‌కుమార్, శివనాయక్, చక్రీధర్, రైతులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

నందకిశోరా.. నవనీతచోరా

ఆళ్లగడ్డ: కృష్ణాష్టమిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో శనివారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలో సందడి చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సందడిగా జరిపారు. స్థానిక విశ్వశాంతి స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్ని కృష్ణులు, ముద్దులొలికే గోపికమ్మల వేషధారణలో పిల్లలు ఆకట్టుకున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చరిత్ర విభాగంలో లెక్చరర్ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, అదనపు అర్హతలు ఏపీసెట్, యూజీసీ నెట్, పీహెచ్‌డీ కలిగి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. పూర్తి వివరాలతో కూడిన బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను ఈనెల 28వ తేదీలోపు ప్రిన్సిపాల్‌కు పంపాలని సూచించారు. ఈనెల 30వ తేదీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని పొన్నాపురం ఎస్సీ కాలనీలోని శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో కర్నూలు జిల్లా ఉమ్మడి శాఖ తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. గోపూజ అనంతరం సామూహిక కుంకుమార్చన, భజన సత్సంఘ కార్యక్రమాలు చేపట్టారు. నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఐదు రోజులుగా వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాల్వ రమేష్, తిరుమలగౌడ్, నరసింహులు, మన్నెం మహేష్, వెంకటరావు పాల్గొన్నారు.

విజయవాడకు వెళ్తున్నానని బయటకు వెళ్లి శవమై..

శిరివెళ్ల: విజయవాడకు వెళ్తున్నానని చెప్పి వారం క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి శవమై కనిపించిన ఘటన మండల పరిధిలోని గోవిందపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని గోవిందపల్లె పరిధిలోని జాతీయ రహదారి ఆనుకుని ఉన్న పందుల ఫారం వద్దనున్న వేపచెట్టు వద్ద మృతదేహం పడివుందని పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో అదే గ్రామంలోని కోళ్ల ఫారంకు చెందిన నక్కా ప్రవీణ్‌గా (45) గుర్తించారు. ఇతను కూలి పనులు చేసేవాడు. మద్యానికి బానిస కావడంతో మార్పు కోసం వారం క్రితం విజయవాడకు వెళ్తున్నానని భార్యతో చెప్పి సెల్‌ఫోన్ ఇంటిలో పెట్టి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి వస్తాడని కుటుంబీలు మిన్నకుండిపోయారు. చివరకు గ్రామంలోనే మృతదేహంగా కనిపించాడు. మృతదేహం కుళ్లిపోవడంతో దుర్వాస వస్తోంది. ఎప్పుడు మరణించాడో తెలియాల్సి ఉంది. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

నరసింహుని సేవలో ఎస్ఈసీ జేఎస్



ఆలయం వెలుపల సాయి ప్రసాద్

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీసర్వ నరసింహ స్వామి ఆలయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ సాయి ప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం, పూజల అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్యం బాటిళ్లు పట్టివేత



ఆళ్లగడ్డ: పట్టుబడిన మద్యం సీసాలతో పోలీసులు

ఆళ్లగడ్డ: మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో తలారి బాలయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో రూరల్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. మొత్తం 96 మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం సీసాలు స్వాధీనం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని దొర్నిపాడు పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరిక్రిష్ణ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో కానిస్టేబుళ్లతో కలిసి ఎస్ఐ దాడులు నిర్వహించారు. 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

26 వేల పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న హౌసింగ్ ఈఈ

శిరివెళ్ల: జిల్లాలో 26 వేల పక్కా గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ అన్నారు. శనివారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా సచివాలయాల వారీగా ఇళ్ల మంజూరు, నిర్మాణ దశలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు 51,076 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అందులో 26 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా మరో 2,672 ఇళ్లు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. వాటిని అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యమన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆదేశమన్నారు. శిరివెళ్ల మండలంలో 490 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇంత వరకు జిల్లాలో రూ. 573 కోట్ల బిల్లులను లబ్ధిదారులకు చెల్లించామన్నారు. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. డీఈ నాగరాజు, ఏఈ నాగేశ్వర్, ఉపాధి పథకం ఏపీఓ రామసుబ్బయ్య, ఈసీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల బాధ్యత టీచర్లకే అప్పగించాలి



ఎంఈఓలకు వినతి పత్రాలు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

రుద్రవరం: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రతపై ఫొటోలు తీసే బాధ్యత ఉపాధ్యాయులకే అప్పగించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంఈఓలు కోటయ్య, లక్ష్మికి వినతి పత్రాలను అందజేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించి వారంలో రెండు రోజులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి మరుగుదొడ్ల పరిస్థితిపై ఫొటోలు చిత్రీకరించి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈ విషయంపై వెల్ఫేర్ అసిస్టెంట్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులే తీసే వారని.. ఇప్పుడు ఆ పనిని తమకు అప్పజెప్పడం సరికాదన్నారు.

టీడీపీ గూండాగిరికి భయపడేది లేదు

- టీడీపీ నేతల దాడిలో గాయపడిన బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: టీడీపీ గూండాగిరికి భయపడేది లేదని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పార్టీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి అన్నారు. టీడీపీ నేతల దాడిలో గాయపడిన లింగందిన్నె గ్రామానికి చెందిన చాకలి శీనుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన చెక్కును మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, పార్టీ నాయకుడు భూమా కిషోర్ రెడ్డి లింగందిన్నె గ్రామంలోని బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో టీడీపీ అరాచక పాలన కొనసాగుతోందన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నది టీడీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. చర్యకు ప్రతి చర్య అనేది కచ్చితంగా ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు అధికారం ఇచ్చింది మంచి పాలన అందించడం కోసమేనని, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై దాడులకు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి కాదన్నారు. ఇలాగే తాము ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు చేసి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో గుర్తుచేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి ముమ్మర ఏర్పాట్లు



ఇస్కాన్ టెంపుల్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

రుద్రవరం: మండలంలోని హరినగరంలో ఉన్న ఇస్కాన్ టెంపుల్‌లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం నుంచే ఆలయ పరిసరాలతో పాటు దేవతామూర్తుల చిత్రాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్‌లు సిద్ధం చేస్తున్నారు. ఇస్కాన్ టెంపుల్ ఇన్‌చార్జ్ చంద్రకేశవదాస్ మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీ సాయంత్రం నుంచి ఉట్లోత్సవం, భజనలు, ప్రముఖులతో శ్రీకృష్ణ జన్మాష్టమి సందేశం, బహుమతుల ప్రదానం, నృత్య, నాటక ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.